క్లుప్తంగా...

బీఆర్ఎస్ నుంచి ఆలయ కమిటీ చైర్మన్ సస్పెన్షన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని లక్ష్మినారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రవిందర్‌గౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డిలు మీడియా సమావేశంలో వెల్లడించారు.

నూతన కమిషనర్‌కు సన్మానం

మేడ్చల్: మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ రాములును సోమవారం ఆయన చాంబర్‌లో కలిసిన కౌన్సిలర్లు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించారు.కౌన్సిలర్లు కౌడే మహేష్, మణికంఠ, దేవ, సాయికుమార్, నర్సింహా స్వామి యాదవ్, హరికృష్ణయాదవ్, సాటి మాధవి నరేందర్, నారెడ్డి కృష్ణవేణి రవిందర్‌రెడ్డి, ప్రియాంక మధుకర్ యాదవ్, అర్చన సందీప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



మేడ్చల్: మేడ్చల్ దాక్షాయని సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన సోమవారం స్వామి వారిని అశ్వ వాహనంపై పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కాగా ఆదివారం రాత్రి హంస సేవ నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు కల్యాణోత్సవం..

దాక్షాయని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం సాయంత్రం 7 గంటలకు ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి తెలిపారు. మొదటిసారిగా మంత్రి మల్లారెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను సమర్పిస్తారని తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు కల్యాణోత్సవంకు హాజరు కావాలని ఆమె కోరారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌కు మేడ్చల్ ఉపాధ్యాయురాలు కవిత



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ ప్రభుత్వ బాలికల పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ముప్పాళ్ల కవిత రాసిన సెమినార్ పేపర్స్ రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ)కు ఎంపికైంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాథ్స్ అండ్ సైన్స్ వారు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల సైన్స్ ఉపాధ్యాయుల నుంచి 'ప్రమోటింగ్ ది కల్చర్ ఆఫ్ సైన్స్ టు మేక్ కంట్రీ సెల్ఫ్ రిలయంట్' అనే అంశంపై సెమినార్ పేపర్స్‌ను కోరింది. అందుకు గాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి ఉపాధ్యాయురాలు కవిత పేపర్స్ ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.మంజూషరాణి, కోపాధ్యాయ బృందంతో సహా జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి అభినందించడంతో పాటు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బడిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు



తరగతి గదులను పరిశీలిస్తున్న పావనీయాదవ్

ఘట్‌కేసర్: పాఠశాలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో తాగునీటి సమస్య ఉందన్న ఉపాధ్యాయుల విన్నపం మేరకు మున్సిపల్ ఏఈ నరేశ్‌తో కలిసి పాఠశాలను సోమవారం సందర్శించి జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదుల పనులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, జంగయ్యయాదవ్, పీడీ వినోద్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మాధవరెడ్డి, రహీం పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఆరేళ్ల జైలు

మేడ్చల్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్ న్యాయస్థానం ఆరేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి వివరాల ప్రకారం.. మేడ్చల్ జుడిషియల్ పరిధిలోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ లిమిట్స్ మచ్చబొల్లారంలో నివాసముండే స్వప్న, సర్వేష్‌లు దంపతులు. సర్వేష్ పెయింటర్‌గా పని చేస్తూ మద్యం సేవించి భార్య స్వప్నను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. 2019 జూన్ 12న స్వప్న వంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. ఈ మేరకు అల్వాల్ పీఎస్‌లో కేసు నమోదు కాగా ముద్దాయిని కోర్టులో పోలీసులు హాజరు పర్చారు. ఇన్నాళ్లు విచారించిన మేడ్చల్ ఏఎస్‌జే న్యాయస్థానం సర్వేష్‌కు ఆరేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్‌జే కుమార్‌జాదవ్ సోమవారం తీర్పు వెల్లడించారు.

సహకారం శక్తివంతం!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మరింత పటిష్టం కానున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు

- నూతనంగా మరో 40 సంఘాల ఏర్పాటుకు చర్యలు
- కేంద్ర కేబినెట్ నిర్ణయంతో సహకార శాఖ కసరత్తు
- రైతులకు మేలంటున్న సంబంధిత అధికార గణం



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతీ గ్రామానికి ఒక సహకార సంఘం ఉండాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా 40 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పడనున్నాయి. ఈ మేరకు జిల్లా సహకార శాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఐదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో సంఘం ఉండాలని ఇటీవల కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) సంఖ్య పెరగనుంది. ప్యాక్స్ ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించగా.. ఈ సానుకూలత జిల్లా రైతులకు ఎంతగానో ఉపకరించగలదని భావిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే 9 ప్యాక్స్ ఉండగా.. ఇందులో రెండు వేలకు పైగా సభ్యులు ఉన్నారు. 61 గ్రామ పంచాయతీల్లో నూతనంగా కనీసం 40 ప్యాక్స్‌ను ఏర్పాటు చేసే వీలుండటం కర్షకులకు కలిసి రానుంది.

రైతులంతా రాయితీ పథకాలు పొందేలా...

సంఘాల్లో రైతులే సభ్యులుగా.. వాటాదారులుగా.. ఉంటుండగా కేంద్రం నూతనంగా సహకార శాఖను ప్రారంభించి నాబార్డు ద్వారా సంఘాలకు ఆర్థిక సాయాన్ని అందిస్తుండగా.. ఇదే తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా సంఘాల ఆధ్వర్యంలో సాగు రంగ సేవలను విస్తృతం చేసేలా చర్యలు చేపట్టింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 9 ప్యాక్స్‌లు ఉండగా చాలా మంది రైతులు ప్యాక్స్‌ల్లో సభ్యులుగా నమోదు కాలేదు. జిల్లాలో 35,800 మంది రైతులుండగా కేవలం 2 వేల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారు. ఇందులోనూ తక్కువ మంది సభ్యులకు మాత్రమే సంఘాల్లో ఓటు హక్కును కలిగి ఉండటం .. సభ్యత్వ నమోదు వెనుకంజను తెలియజేస్తోంది. భవిష్యత్‌లో ప్యాక్స్‌ల సంఖ్య పెంటచం వల్ల రైతులంతా సహకార సంఘాల్లో సభ్యులుగా నమోదై రాయితీ పథకాలను పొందేలా అవకాశముంటుంది. అలాగే, సంఘాలు, పాలకమండళ్లు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, సంబంధిత అధికారులు కూడా రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు పొందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

కీలకంగా సంఘాల పాత్ర...

జిల్లాలోని అన్ని సంఘాల పరిధిలో ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయి. నాబార్డు ద్వారా చాలా సంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములు నిర్మిస్తున్నారు. సంఘాల పరిధి గ్రామాల్లోని గోదాముల్లో రాయితీ విత్తనాలు, ఎరువులను నిల్వచేసి రైతులకు విక్రయిస్తుండటంతో రైతులకు స్థానికంగానే ఉత్పాదకాలు లభిస్తున్నాయి. వాహన, బంగారం రుణాలు, పురుగుల మందుల విక్రయం, మంచినీటి ప్లాంటు తదితరాలను కూడా చాలా చోట్ల సంఘాలు చేపడుతుండటంతో వీటి పాత్ర కీలకంగా మారింది.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం సంఘాల ద్వారానే...

నూతన సహకార విధానం ప్రకారం సంఘాల ద్వారానే సేంద్రియ సాగును ప్రోత్సహించడం, బిందు సేద్య పరికరాలను ఇవ్వడం, ఉపాధి హామీ పథకంలో నారును పెంచి మొక్కల పంపిణీ చేపట్టడం, విత్తనశుద్ధి కేంద్రాల ఏర్పాటు, భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటు, వ్యవసాయ, ఉద్యాన శాఖల రాయితీ పథకాలను అమలు చేయడం, జీవన ఎరువుల తయారీ కేంద్రాల ఏర్పాటు తదితరాలు ప్రభుత్వ ఉద్దేశ్యంగా ఉండగా.. ఇవన్నీ అమలైతే సంఘాలు మరింతగా శక్తివంతమవుతాయి. బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్ల సదుపాయం, తక్కువ వడ్డీకి అప్పులివ్వడం, డిపాజిట్ల సేకరణ తదితరాలతోనూ చాలా సంఘాలు తమ పాత్రను పోషిస్తున్నాయి.

> **సంఘాల ద్వారా సభ్యులకే లాభాలు**
>
> సంఘాల లాభాల్లోనూ రైతులకు వాటా ఉంటుండగా.. సంఘాల్లో ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు బీమా వంటి సదుపాయాలున్నాయి. అన్ని సంఘాల్లోనూ వాటి పరిధి గ్రామాలు, పట్టణాల రైతులను సభ్యులుగా చేర్పేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రాంతాల రైతులు స్వతంత్రంగా ముందుకు వచ్చి సభ్యులుగా చేరాలి.
>
> – శ్రీనివాస్‌మూర్తి, సహకార శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్‌ఓ లింగ్యానాయక్



మాట్లాడుతున్న డీఆర్‌ఓ లింగ్యానాయక్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్చి15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని, పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని డీఆర్‌ఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 133 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతులన్నీ ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 62,342 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1,452 మంది మొత్తంగా 63,794 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్లో 54,146 మంది, ఒకేషన్ కోర్సుల్లో 995 విద్యార్థులతో సహా మొత్తంగా 55,141మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జనరల్లో 1,16,488 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 2,447 మంది విద్యార్థులతో సహా మొత్తంగా 1,18,935 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షల కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణం



విగ్రహ ప్రతిష్ఠలో హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సుతారిగూడలో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, అమ్మవారి కల్యాణం మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ముదిరాజ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కావేరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

ఘట్‌కేసర్: అంకుషాపూర్ జెడ్పీ పాఠశాలకు గెయిల్ గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్‌ను సోమవారం అందజేశారు. అలాగే విద్యార్థులకు ప్లేట్లు, స్పోర్ట్స్ కిట్లను సర్పంచ్ జలజ, ఉప సర్పంచ్ బాలమణి, గెయిల్ ప్రతినిధి ఎల్‌ఎస్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రప్ప, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్లు, ప్లేట్లు అందుకున్న విద్యార్థులతో గెయిల్ ప్రతినిధులు

రాకపోకలకు తాత్కాలిక ఉపశమనం



బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగించడానికి సిద్ధమైన రోడ్డు

మేడ్చల్: పట్టణ, గ్రామాల ప్రజల రాకపోకలకు చాలా కాలంగా శాపంగా మారిన మేడ్చల్–గిర్మాపూర్ రోడ్డులో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నుంచి ప్రయాణాలు సాగించేందుకు ఏర్పాట్లు చేయడంతో ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఏళ్ల తరబడిగా బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో పట్టణంలో పది కాలనీల ప్రజలకు, గిర్మాపూర్, రాయిలాపూర్, బండమాదారం, శ్రీరంగవరం గ్రామాల ప్రజలకు మేడ్చల్ నుంచి వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. డబీల్‌పూర్, గౌడవెల్లిల మీదుగా ప్రయాణం చేయాల్సి వచ్చింది. బ్రిడ్జి అవతలి వైపు ఉన్న రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో 50 శాతం పూర్తయిన బ్రిడ్జి పనుల నుంచి అటు, ఇటు రాకపోకలు సాగించేందుకు వీలుగా మున్సిపల్ అధికారులు, చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డిలు ఏర్పాట్లు చేయించారు. ట్రాక్ కింద బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఇరు వైపులా మట్టి తవ్వి వాహనాలు వెళ్లేలా తాత్కాలిక రోడ్డు వేశారు. దీంతో అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పరామర్శించారు. డబీల్‌పూర్ గ్రామంలో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్, సంజీవరావు, విజయ్, మోహన్, సల్ల వెంకటేష్, సత్యానారాయణ, శ్రీరాంరెడ్డి సుధాకర్, అక్రమ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్.284, 644, 645లలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను సోమవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించబోమని, వారిపై కఠిన చర్యలు చేపడుతామన్నారు.



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే ఈటల సమక్షంలో బీజేపీలో చేరికలు



ఈటలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రవిందర్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. గుండ్లపోచంపల్లిలోని లక్ష్మినారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రవిందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ వార్డు సభ్యులు సురేందర్ ముదిరాజ్, మల్లిగే శ్రీకాంత్ తదితరులకు ఈటల పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు హన్మంత్, అశోక్, నాగరాజు, శ్రీధర్, వెంకట్, నరేశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేట్ తెరవాలని వినతి



మేడ్చల్: అత్వెల్లిలోని సెయింట్ క్లారెట్ స్కూల్ గేట్ తెరవాలని మూడో వార్డు కౌన్సిలర్ జాకట దేవ స్కూల్ మేనేజ్‌మెంట్ బాధ్యులు అంత్యు, మాత్యులను కోరారు. ఈ మేరకు ఆయన పాఠశాలకు వెళ్లి వారికి వినతి పత్రం సమర్పించారు. పాఠశాల ఎన్‌హెచ్–44పై ఉండటంతో ప్రధాన గేట్ రహదారి వైపు ఉందని పిల్లలు ఆ గేట్ ద్వారా రాంగ్ రూట్‌లో వెళ్లడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. పక్కనే కాలనీ వైపు ఉన్న రోడ్డు వద్ద గేట్ ఏర్పాటు చేసి అక్కడ ఓపెన్ చేయాల ని, అలా చేస్తే విద్యార్థులు హైవేపైకి వెళ్లకుండా అత్వెల్లి మీదుగా బస్టాప్ వరకు చేరుకుని నేరుగా వారి గమ్య స్థానాలకు వెళ్లొచ్చన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా గేట్ ఓపెన్ చేయాలని ఆయన కోరారు.

నిరుపేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజు

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన కొర్రెముల్‌కు చెందిన కలమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.37,500ల చెక్కును సోమవారం వారు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రీతి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి



జవహర్‌నగర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు



మేడ్చల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాలు, విద్యార్థులు

జవహర్‌నగర్: ర్యాగింగ్ వేధింపులకు బలైన వైద్య విద్యార్థిని దారావత్ ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బాలాజీనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, నాయకులు శ్రీనివాస్, సునీత, శ్రీను, రాజుయాదవ్, యాదగిరి, సుమన్, నర్సింహ, సుగుణ, లత, జోగి, సునీత, చింత విజయ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: మెడికో ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోద అరుణ్‌కుమార్ యాదవ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్‌లు డిమాండ్ చేశారు. వారు వేర్వేరుగా మేడ్చల్‌లో మాట్లాడుతూ.. డాక్టర్ ప్రీతి మరణం చాలా బాధాకరమని, ఇలాంటి మరణాలకు దారి తీసిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ర్యాగింగ్ భూతాన్ని అరికట్టేందుకు కళాశాలల యాజమాన్యాలు, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజన సంఘాల ఆధ్వర్యంలో...

మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మేడ్చల్‌లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మేడ్చల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు ఆమె చిత్రపటంకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ధన్‌రాజ్‌నాయక్, యువకులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరి తీయాలి...

పోచారం: మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను ఉరితీయాలని బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాథ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అన్నోజిగూడలోని జడ్పీ హై స్కూల్‌కు సెలవు ప్రకటించాలని కోరుతూ మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విక్రమ్‌రెడ్డి, ఎన్.సురేష్, విజయలక్ష్మి, తావుర్యా, మెట్టు నర్సింహారెడ్డి, కల్యాణ్ నాయక్, సీతారాం, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో 83 ఫిర్యాదు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో తరలివచ్చిన ప్రజల నుంచి 83 విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ప్రజావాణిలో డీఆర్‌డీఏ పద్మజారాణి, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, సీపీఓ మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎల్లంపేట్ సర్పంచ్‌పై...

మేడ్చల్: మండలంలోని ఎల్లంపేట్ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడుపై గ్రామానికి చెందిన కొంతమంది ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు గతేడాడి జనవరి 22న అధికార దుర్వినియోగంపై సస్పెండ్ చేయగా ఈ విషయం కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, గ్రామ కార్యదర్శి ప్రభుత్వ అధికారుల హోదాలో ఉండి చట్టానికి వ్యతిరేకంగా సస్పెండ్‌లో ఉన్న సర్పంచ్ మేకల వెన్నెలతో పంచాయతీ కార్యాలయంలో గతేడాది డిసెంబర్ 24న జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు లేకుండా నలుగురు ప్రభుత్వ అధికారులు సస్పెండ్ కాబడ్డ సర్పంచ్‌తో సమావేశం నిర్వహించారని, విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించారని ఫిర్యాదు



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి మూడో వార్డులో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని గ్రామానికి చెందిన మహేందర్ కొంతమందితో కలిసి మున్సిపల్ కమిషనర్ రాములుకు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం ఎదురుగా గత కొన్నేళ్లుగా బావి ఉండగా.. ఆ బావి ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉండగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని ఆక్రమించుకుని బావిని పూర్తిగా పూడ్చేశారని ఫిర్యాదు చేశాడు. భూమి ఆక్రమణతో పాటు నేరుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎకంగా ఇల్లు నిర్మిస్తున్నారని, అధికారులు పట్టించుకుని అట్టి నిర్మాణాన్ని అడ్డుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ వలంటీర్లు



వలంటీర్లను అభినందిస్తున్న ఏయూ ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా

ఘట్‌కేసర్: జాతీయ సమైఖ్యత శిబిరానికి అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)కి చెందిన వలంటీర్లు అభిషేక్, హుమ్మె సల్మా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి నర్సాపూర్‌లో మార్చి 3 నుంచి 9వ తేదీ వరకు జాతీయ సమైక్యత శిబిరం జరగనుంది. ఈ సందర్భంగా ఏయూ ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, స్కూల్ ఆఫ్ డీన్ ఫార్మసీ వసుధ భక్షి, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 4 బాధ్యులు నవీన్, కిరణ్‌కుమార్ తదితరులు శిబిరానికి ఎంపికైన వలంటీర్లు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో వలంటీర్లు విఘ్నేశ్, సింధు, తేజ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

ఘట్‌కేసర్: పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలివ్వకపోవడం సిగ్గుచేటని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవుషాపూర్ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించపోవడంపై సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి, కార్మికులతో కలిసి సోమవారం ఆ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎంపీపీ నిరసన చేపట్టారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో కార్మికులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మల్లేశ్, మశ్చేందర్‌రెడ్డి, సాయిలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన చేపట్టిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్, కార్మికులు

ముమ్మరంగా బీజేపీ కార్నర్ మీటింగ్‌లు



మాట్లాడుతున్న సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్

మేడ్చల్: 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ నిర్వహిస్తున్న బూత్ స్థాయి శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లు మేడ్చల్ మున్సిపాలిటీ, బండమాదారం గ్రామాల్లో నిర్వహించారు. పాల్గొన్న పార్టీ ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌గౌడ్, జగన్‌గౌడ్, విఘ్నేష్‌లు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలకు వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సురేష్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడ భవానీనగర్‌కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాలి సంపత్‌యాదవ్, బీజేపీ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, రవీందర్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడుల నివారణపై సదస్సు

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపాలిటీ డ్వాక్రా భవనంలో వీధి కుక్కల దాడుల నివారణకు ప్రభుత్వం జారీ చేసిన 3308/టీపీ, ఈ(2)2023పై డ్వాక్రా మహిళలు, మెప్మా అధికారులు, సూపర్ వైజర్లు, మున్సిపాలిటీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందికి కమిషనర్ వేమనరెడ్డి అధ్యక్షతన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో వీధి కుక్కల దాడుల నివారణకు హెల్ప్‌లైన్ 14420కు, మున్సిపాలిటీ హెల్ప్‌లైన్ 9154083772కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బాలాజీనగర్‌లో 9553480826 నంబర్‌కు, కొండాపూర్‌లో 7729005033, ఎన్ఎఫ్‌సీనగర్‌లో 8019660211, ఘట్‌కేసర్‌లో 9393595938 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. జంగయ్యయాదవ్, సిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

